క్లుప్తంగా

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన 14 మంది చిన్నారులు తమ నృత్య ప్రతిభను చాటారు. నృత్యాచార్య కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్య బృందంకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

ప్రసన్నాంజనేయులు సేవలు ఎనలేనివి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సమాజ శ్రేయస్సు కోసం ప్రసన్నాంజనేయులు చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. కేఎల్‌రావునగర్ బ్యాంక్ కాలనీలోని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ కార్యాలయంలో క్లబ్ సభ్యులు చేదెళ్ల ప్రసన్నాంజనేయులు సంతాప సభ ఆదివారం నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్వీ.రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ప్రసన్నాంజనేయులు చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ తరుపున మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసే దానికి వసతిని కల్పించారని, కాలనీలో అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు సూర్యారావు, ఎస్. ఈశ్వరరావు, వై.నారాయణ స్వామి, క్లబ్ అధ్యక్షులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దైనందిన జీవనంలో యోగా భాగం చేసుకోవాలి



నందిగామరూరల్: యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవనంలో నిత్యకృత్యం చేసుకోవాలని ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంప్లాయిస్ థీమ్‌లో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం యోగా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. వత్తిడి, ఆందోళనతో పాటు నిత్య జీవితంలో ఎదుర్కొనే అనారోగ్య సమస్యలకు యోగాతో పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం యోగా గురువు సంగెపు సుధాకర్ ఆర్డీవో, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలపై అక్రమ కేసులకు వైఎస్సార్ సీపీ నిరసన



ఇబ్రహీంపట్నం: బీసీ సామాజిక వర్గాలపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు నిలిపి వేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో బీసీ యువకుడు ఉప్పతల హరికృష్ణపై పోలీసులు పెట్టిన అక్రమ కేసుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి, నల్లజెండాలు ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి వేముల బేబీరాణి, బీసీ జిల్లా విభాగం అధ్యక్షుడు మార్తా శ్రీను, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుటుంబ సభ్యులకు కూడా తెలియకుండా హరికృష్ణను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. బీసీ విభాగం నియోజకర్గ అధ్యక్షుడు కుంచం జయరాజు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, వివిధ విభాగాల నాయకులు కోమటి కోటేశ్వరరావు, కోలకాని శ్రీనివాస్, రాజేష్, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రద్దుతో ప్రజలకు అవస్థలు

- సర్కిల్–1 పరిధిలో 97 వాహనాలు
- ఎండీయు వాహనాల రద్దుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న జనం
- రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్



ఎండీయూ వాహనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రజలకు ఎంతో మేలు జరిగింది. అందులో భాగంగా రేషన్ సరుకులను ఇంటికి చేరువ చేసేందుకు ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టింది. అయితే ఐదేళ్లుగా ఇంటి గుమ్మం వద్దే ఇస్తున్న రేషన్ అకస్మాత్తుగా కూటమి ప్రభుత్వం నిలిపేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇంటి వద్దే రేషన్, పింఛన్లు, అవసరమైన సర్టిఫికెట్లు వలంటీర్ల ద్వారా అందించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు తొలగించారని, ఇప్పుడు ఏం కావాలన్నా సచివాలయాలకు, రెవెన్యూ కార్యాలయానికి తిరగాల్సి వస్తోందని మండిపడుతున్నారు. ఇన్నాళ్లు ఇంటి ముందుకు వచ్చి రేషన్ ఇచ్చే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో మళ్లీ పాత కాలం నాటి కష్టాలు మొదలయ్యాయని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజల ముంగిటకు సరుకులు....

ఇంటికి దూరంగా ఉన్న రేషన్ షాపు వద్దకు నడిచి గానీ ఆటోలో గానీ వెళ్లాలి.. తీరా వెళ్లాక షాపు తీసి ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. లేదంటే మరొక రోజు వెళ్లాల్సి వచ్చేదని వెనుకటి రోజులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. నాలుగు రోజులు ఆలస్యంగా వెళ్తే సరుకులు అయిపోయాయని చెప్పేవారని, దూరాభారంగా ఉండే రేషన్ షాపుకు ఆటోలో వెళ్తే బియ్యం ధర కంటే ఆటో ఖర్చే అధికమవుతుందని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా ఉన్న పళంగా ఇంటి వద్దకు రేషన్ పంపిణీ విధానాన్ని తొలగిస్తే మరలా రేషన్ కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆడవాళ్లు ఇళ్లల్లో పనులకు, మగాళ్లు కూలీ పనులకు పోయేటోళ్ళం.. మేమున్న సమయంలో ఇంటికి బండి వచ్చేది..చక్కగా రేషన్ ఇచ్చేవారు. ఇప్పుడు మరలా రేషన్ కోసం పనులు మాని క్యూలు కట్టలేమని, ఎప్పట్లా ఇంటి వద్దే రేషన్, పింఛను ఇవ్వాల్సిందేనని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

సర్కిల్–1 పరిధిలో...

సర్కిల్–1 పరిధిలో సుమారుగా 147 రేషన్ దుకాణాలు కొనసాగుతున్నాయి. సర్కిల్ పరిధిలో పశ్చిమ నియోజకవర్గంతో పాటుగా చుట్టుపక్కల వివిధ సరిహద్దు ప్రాంతాలకు చెందిన డిపోలు సైతం పని చేస్తుంటాయి. దాదాపుగా రెండు డిపోలకు ఒక రేషన్ బండి చొప్పున సర్కిల్–1 పరిధిలో 97 ఎండీయూ వాహనాల (రేషన్‌బళ్లు) ద్వారా ప్రతి నెలా రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. ప్రతి డివిజన్‌లోనూ ఇళ్ల వద్దకు రేషన్ బండి వచ్చి సరుకులు అందజేసేది. నాలుగేళ్లుగా అలవాటైన పద్ధతిని రద్దు చేసి మరలా పడిగాపులు కాయమనడం సబబేనా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

మా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎండీయూ వ్యవస్థ వచ్చిన తరువాత రేషన్ సరుకులు తీసుకుంటున్న కుటుంబాల శాతం అత్యధికంగా పెరిగింది. అటువంటి సేవలందిస్తున్న వాహనాలను తొలగించటం చాలా అన్యాయం. తమకే కాకుండా సరుకులు తీసుకునే ప్రజలకు సైతం దీని వలన కష్టాలు మొదలవుతాయి. దీనిపై ప్రభుత్వం మరోసారి ఆలోచన చేసి వాహనాలను కొనసాగించాలి.

– ఏడిద వెంకన్న, ఎండీయూ ఆపరేటర్

ఎండీయు వాహనాలను కొనసాగించాలి



ఎండీయు వాహనాలను కొనసాగించాలి. డిపోలు దూర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఈ వాహనాల వలన ఇంటికి రేషన్ సరుకులు అందుతున్నాయి. వృద్ధులు, మహిళలు ఈ విధమైన సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నారు. వాహనాలను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించటం సరికాదు. దీనివలన ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుంది. అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ప్రభుత్వం పెద్దలు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– కె.హరీష్‌కుమార్, వించిపేట

దుర్మార్గపు నిర్ణయాలు



చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గపు నిర్ణయాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన పలు సంస్కరణలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఎండీయూ వాహనాల వలన ప్రజల ముంగిటకే రేషన్ సరుకులు వెళ్తున్నాయి. అలాగే ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుంది. జగన్ మోహన్‌రెడ్డి ఆనవాళ్లను ఉంచకూడదనే కూటమి ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పునుకుంటుంది.

– షేక్ హయత్, రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం

ఆపరేటర్ల పొట్ట కొడుతున్నారు



ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల పొట్ట కొడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా ఉన్న ఆపరేటర్లను ఉన్న పళంగా తీసివేయటం వలన ఆ కుటుంబాలు పస్తులుండే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దానికి తోడు గడిచిన నాలుగైదు ఏళ్లగా ప్రజల ఇళ్లకు రేషన్ సరుకులు అందిస్తున్న ఈ వ్యవస్థను తొలగించటం సరికాదు. ఉన్న వ్యవస్థను రద్దు చేయటం ఏమిటి...? దీనివలన ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– బోయి సత్యబాబు, సీపీఎం ఫ్లోర్‌లీడర్

ప్రజా వ్యతిరేక విధానాలపై నిలదీయాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు నిలదీయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 51వ డివిజన్ ఇచార్జి తుపాకుల గురుమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థానిక డివిజన్ పార్టీ కార్యాలయాన్ని వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ వైఎస్సార్ సీపీలో గెలిచి తన స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారాటం దుర్మార్గమన్నారు. పార్టీ మారినప్పుడు తన పదవికి సైతం రాజీనామా చేసి మారాలన్నారు. చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేపట్టిందని ధ్వజమెత్తారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క పథకాన్ని ప్రజలకిచ్చిన పాపాన పోలేదని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పార్టీ శ్రేణులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. అలాగే శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని పేర్కొన్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ ప్రజలకు పథకాలిచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన వైఎస్సార్ సీపీ నిర్వహించే వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో తన ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్పా ప్రస్తుతం ఉన్న కూటమి ఎమ్మెల్యే పాలనలో ఏ ఒక్కటి ముందుకు సాగటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.చైతన్య రెడ్డి, అమర్నాథ్, నాయకులు మనోజ్‌కొఠారి, బొమ్మ మధు, డేరంగుల రమణ, మజ్జి శ్రీనివాసరావు, విశ్వనాథ రవి, దుర్గారావు, శ్రీనివాసరావు, శ్యామ్, పైడిపాటి దుర్గారావు, వెంకటరావు, అప్పారావు, మహేష్, మదీనా, బుజ్జి, నాగరాజు, పోతన విజయ్ తదితరులు పాల్గొన్నారు

సృజనాత్మకత భవితకు బంగారుబాట



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: సృజనాత్మకత యువత భవితకు బంగారుబాట అని ట్రాఫిక్ జోన్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, గ్రంథాలయ పునర్వికాస వేదిక, స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బాల బాలికల శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పారు. గ్రంథాలయాలు తన జీవిత గతిని మార్చాయన్నారు. గ్రంథాలయాలతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

బాల బాలికలకు దిశానిర్దేశం..

గ్రంథాలయ పునర్వికాస వేదిక నాయకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. శిబిరంలో అనేక విషయాల్లో వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆదివారం నాటి శిబిరంలో మినీ డిక్షనరీను తయారు చేయడం, కథలను చదవడం, ఇతరులకు వినిపించడం అంశంగా శిక్షణ ఇచ్చారు. సుధా, స్పందన, నవసాహితీ పబ్లికేషన్ల తరపున జే.నరసింహమూర్తి, ఏ.భాస్కరరావు, కె.రవి పాల్గొని శిబిరంలో పాల్గొన్న బాల బాలికలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిభ చూపిన బాల బాలికలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

ఆదర్శంగా నిలిచిన ఆటోడ్రైవర్‌కు సత్కారం



ఆటో డ్రైవర్ రవీంద్రరావును సత్కరిస్తున్న సీఐ కిశోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో ఆదివారం సాయంత్రం శ్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ ప్రత్యేకమైన సంఘటన ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. తనిఖీల సమయంలో ఓ ఆటోడ్రైవర్ యూనిఫామ్ ధరించి తన పేరు, లైసెన్స్ నంబర్, బ్యాడ్జి నంబర్ వంటి వివరాలు స్పష్టంగా కనిపించేలా బ్యాడ్జి పెట్టుకుని నిబంధనల ప్రకారం ఆటో నడుపుతున్నాడు. అతడిని గుర్తించిన సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ వెంకట్ కుమార్‌లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ ప్రయాణికులకు ఆదర్శంగా నిలుస్తున్న డ్రైవర్ పి.రవీంద్రరావును అభినందిస్తూ ఆటో డ్రైవర్ల సమక్షంలో పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నగరంలో ఆటో డ్రైవర్లందరూ రవీంద్రరావును ఆదర్శంగా తీసుకుని ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ఇటువంటి డ్రైవర్లు నగరానికి గౌరవాన్ని తీసుకువస్తారని చెప్పారు. తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న నాలుగు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు.

కారుమబ్బులు కమ్ముకొని...



దుర్గగుడి గోపురం సమీపంలో నల్లటి మబ్బులు

బెజవాడలో ఆదివారం కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉదయం నుంచి ఎండ బాగా కాసినా మధ్యాహ్నం మూడు గంటల సమయానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. నల్లటి కారు మబ్బులతో ఆకాశం మేఘావృతమైంది. ఆ తర్వాత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో ఇబ్బందిపడిన నగర వాసులు వర్షంతో కొంత సేదతీరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రకాశం బ్యారేజి సమీపంలో కమ్ముకున్న మబ్బులు

హామీల అమలులో కూటమి విఫలం

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. పశ్చిమ నియోకవర్గం, గొల్లపాలెంగట్టు రోడ్డులోని అరుణా కాన్వెంట్‌లో ఆదివారం జరిగిన సీపీఐ 2వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పాలనలో విజయవాడ నగరం అభివృద్ధి పథంలో ముందుందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తి విఫలం చెందిందని ధ్వజమెత్తారు. ఇల్లులేని నిరుపేదలకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.4లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీనీ పూర్తిగా ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం శోచనీయమని తెలిపారు. ఇళ్ల సాధన కోసం జూన్ 3వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ మహాసభలో నగర సమితి సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, పార్టీ నాయకులు తాడి పైడయ్య, కొట్టు రమణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఈ మహాసభలో తొమ్మిది మందితో కూడిన నూతన కమిటీ ఎన్నుకున్నారు.

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి భక్తులు వేలాదిగా వందల సంఖ్యల వాహనాలతో తరలి రావటంతో ఆదివారం గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. సెలవు దినాలు కావటంతో పాటు మొక్కులు తీర్చుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారి వాహనాలతో గ్రామంలో అన్ని రోడ్లు నిండిపోయాయి. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఆలయం వరకు, చెరువుకట్ట, డౌన్ సెంటర్, మునేరు కాజ్‌వే నాలుగు రోడ్లలో వాహనాలు నిలిచి పోవటంతో ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు. పోలీసులతో పాటు వాహనదారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ కొనసాగింది.

అన్నదానానికి రూ.15 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పల్నాడు జిల్లా నిడుముక్కల గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మావతి కుటుంబసభ్యులు రూ.15 వేలను ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమ్స్ పరీక్షలు



యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం నగరంలోని వివిధ కేంద్రాల్లో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని ఉదయాన్నే నగరానికి చేరుకున్నారు. విజయవాడ వన్‌టౌన్ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయం, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలోనూ వినతులు స్వీకరిస్తామన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాల్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.